క్లుప్తంగా

కాండ్రకోటలో కొనసాగుతున్న చండీహోమం



నూకాలమ్మ ఆలయం వద్ద కొనసాగుతున్న చండీహోమం

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోటలో వినిపిస్తున్న వందతుల నేపథ్యంలో వారం రోజులుగా నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో చేపట్టిన పూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఆలయ పండితులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో మహా చండీహోమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. గ్రామస్థుల శ్రేయస్సు కోరుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నారు. పూజలు ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎటువంటి దుష్ట శక్తుల ప్రభావం కనిపించ లేదని, సిద్ధాంతుల సూచనల మేరకు జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

దవులూరి పరామర్శ



కౌన్సిలర్ సోదరుని భౌతికదేహానికి నివాళులు అర్పిస్తున్న కో ఆర్డినేటర్ దొరబాబు

సామర్లకోట: స్థానిక 25వ వార్డు కౌన్సిలర్ గుబ్బల సత్యనారాయణను, అతని కుటుంబ సభ్యులను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆదివారం పరామర్శించారు. గీత కార్మికుడైన కౌన్సిలర్ సోదరుడు ఆదివారం ఉదయం ఇంటి వద్ద ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దొరబాబు కౌన్సిలర్ స్వగృహానికి చేరుకుని మరణానికి గల కారణాలను కౌన్సిలర్ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు మృతుని భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్ని సంతాపం తెలిపారు.

ఇర్రిపాకలో శివలింగం వద్ద సర్పం



ఇర్రిపాకలో ద్వాదశ జ్యోతిర్లింగాల వద్ద ఉన్న సర్పం

జగ్గంపేట: ఏలేరు నది ఒడ్డున ఇర్రిపాక గ్రామంలో కొద్ది రోజుల క్రితం ప్రతిష్ఠించిన ద్వాదశ శివలింగాల వద్ద ఓ సర్పం తారసపడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రతిష్ఠాపన కొద్ది రోజుల క్రితం జరిగింది. శివరాత్రి రోజు ఇక్కడ కోటి మట్టి శివలింగాలతో మహా కుంభాభిషేకం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ ప్రాంతంలో రెండు తలల పాము రావడం, శివలింగాలను తాకుతూ తిరగడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఆలయ పూజారులు, భక్తులు అక్కడ పూజలు చేసి, సర్పానికి హారతులు ఇచ్చారు.

వైద్యం కోసం రూ.2 లక్షల సాయం

జగ్గంపేట: కాట్రావులపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న జగత దుర్గాప్రసాద్ కుమారుడు సిద్ధుకు వైద్యం చేయించేందుకు సేకరించిన రూ.2 లక్షల నగదును గ్రామ పెద్దలు ఆదివారం అందజేశారు. సుమారు ఏడాది నుంచి సిద్ధు మెదడు సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య చికిత్స కోసం సుమారు రూ.8 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. ఈ నేపథ్యంలో కాట్రావులపల్లి గ్రామానికి చెందిన నాయకుడు ముసిరెడ్డి నాగేశ్వరరావు, బాధిత కుటుంబం కష్టాలను సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. దీంతో కాట్రావులపల్లితో పాటు, పలువురు యువకులు, వివిధ గ్రామాలకు చెందిన వారు రూ.1,81,900 పంపించినట్టు నాగేశ్వరరావు తెలిపారు. తన వంతుగా మరో రూ.20 వేలు కలిపి మొత్తం రూ.2,01,900లను బాధిత కుటుంబానికి గ్రామ పెద్దల సమక్షంలో అందించారు.

వైభవంగా స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

గండేపల్లి: మల్లేపల్లిలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఏడో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా పల్లకీలో స్వామి, అమ్మవార్లను వైభవంగా గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆదివారం ఉదయం విఘ్నేశ్వర స్వామి పూజ అనంతరం కలశలను శిరస్సున ధరించి, 108 మంది కన్యకామణులతో జరిగిన ఈ ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆడపడుచులకు ఆసరా..

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం జగన్
- నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా రుణమాఫీ



డ్వాక్రా సంఘాల అక్కచెల్లెమ్మలకు ఆసరా చెక్కును అందజేస్తున్న దొరబాబు (ఫైల్)

పెద్దాపురం: మహిళలకు పెద్దపీట వేస్తున్న జగనన్న ప్రభుత్వం అవకాశం వచ్చినపుడల్లా వారికి అండదండగా నిలుస్తోంది. డ్వాక్రా రుణ మాఫీలో గత టీడీపీ ప్రభుత్వం మోసం చేయగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలోనే విడతల వారీగా ఆయా రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చింది. ఆ మేరకు నాలుగు విడతలుగా వైఎస్సార్ ఆసరా నిధులు విడుదల చేసి మనసున్న నేతగా పేరొందారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.

నాలుగున్నరేళ్లలో సాయం ఇలా..

మండలం 23 గ్రామల పరిధిలో నాలుగున్నరేళ్ల కాలంలో 20,115 మందికి రూ.53 కోట్లు లబ్ధి చేకూరింది. పట్టణంలో 29 వార్డుల పరిధిలో 18,530 మందికి రూ.133 కోట్లు నాలుగున్నరేళ్లలో పంపిణీ చేశారు. ఈ నెలలో నాలుగో విడత పెద్దాపురం మండలంలోని 1605 సంఘాలకు రూ.13.55 కోట్లు పెద్దాపురం పట్టణంలో 714 సంఘాలకు రూ.5.95 కోట్లు పంపిణీ చేశారు.

మహిళాభ్యుదయమే లక్ష్యంగా రుణాలు...:

పెద్దాపురం అర్బన్, రూరల్ పరిధిలో 20,538 మహిళా శక్తి సంఘాలకు 37,738 మంది సభ్యులు రుణాలు పొందుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.154 కోట్ల రుణాలిచ్చే లక్ష్యం కాగా రూ.216 కోట్లు డ్వాక్రా సంఘాలకు రుణాలిచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గత ఏడాది డిసెంబర్ వరకు 18,530 మందికి రూ.133 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేశారు. ఇక స్త్రీ నిధి రుణాలు లక్ష్యం రూ.54 కోట్లు కాగా ఇప్పటి వరకు 733 మందికి రూ.6.27 కోట్లు అందజేశారు. మిగిలిన రుణ లక్ష్యాన్ని మార్చి నాటికి పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మాఫీ సొమ్ము ఆసరాగా నిలిచింది



మాది పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామం. నేను శ్రీమాలతి. మహిళా సంఘ సభ్యురాలిని. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మా సంఘానికి నాలుగు విడతల్లో రూ.6,80,932 రుణా మాఫీ జరిగింది. వ్యక్తిగతంగా నాలుగు విడతల్లో రూ.66,800 రుణం మాఫీ అయ్యింది. చాలా ఆనందంగా ఉంది.

– **కడియాల వరలక్ష్మి**, కట్టమూరు. పెద్దాపురం మండలం

హామీని నిలబెట్టుకున్నారు



నేను సాయి కిరణ్ మహిళా సంఘం సభ్యురాలిగా ఉన్నాను. సీఎం జగన్ రుణమాఫీ హామీని నిలబెట్టుకున్నారు. మా సంఘానికి నాలుగో విడతగా 1,67,018 రూపాయలు రుణ మాఫీ జరిగింది. నాలుగు విడతల్లో మొత్తం రూ.6,68,072 ఆసరా ద్వారా మాఫీ జరిగింది. వ్యక్తిగతంగా మొత్తం రూ.66,800 నా ఖాతాకు జమ అయ్యింది.

– **మత్తుర్తి నాగేశ్వరి**, నాగేశ్వరరావు వీధి, పెద్దాపురం

మహిళలకు కొండంత అండ



రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కొండత అండగా నిలుస్తోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సంఘాలను బలోపేతం చేయడమే కాకుండా వారిని ఆర్థికంగా ఆదుకుంటున్నారు. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా పథకాన్ని నాలుగు విడతల్లో విడుదల చేయడం వల్ల డ్వాక్రా సంఘాల మహిళల్లో ఆనందం కనిపిస్తోంది.

– **భ్రమరాంబ**, మెప్మా, సీఎంఎం, పెద్దాపురం

సామూహిక సూర్య నమస్కారాల పోటీలు



సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

పిఠాపురం: సేవా భారతి ఆధ్వర్యంలో స్థానిక ఆర్ ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం విద్యార్థులకు సామూహిక సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించారు. పిఠాపురంలో 17 పాఠశాలలకు చెందిన 296 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి కైవసం చేసుకోగా, ద్వితీయ బహుమతిని లిటిల్ సోల్జర్స్ స్కూలు విద్యార్థులు సాధించారు. సేవా భారతి సభ్యులు అశోక్, డాక్టర్ జోగా వీరబాలాజీ, డాక్టర్ జైపాల్ రెడ్డి, కొండెపూడి శంకర్రావు, అల్లవరపు నగేష్ తదితరులు విజేతలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు.

నాగులాపల్లిలో..

కొత్తపల్లి: మండలంలోని నాగులాపల్లిలో ఉన్న శివాలయం సెంటర్ వద్ద ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సూర్య నమస్కారాల పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో హిందు చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు అబ్బిరెడ్డి అప్పారావు, ప్రముఖ పారిశ్రామికవేత్త వినోద్‌బాబు, మండల కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ వంగా గీత



బోనాలతో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

- కాకినాడ ఎంపీ వంగాగీత
- చేబ్రోలులో కనకదుర్గమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

పిఠాపురం: గ్రామాల్లో ఆధ్యాత్మిక కేంద్రాలుగా వెలుగొందుతున్న గ్రామ దేవతల ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి సెంటర్ వద్ద నూతనంగా నిర్మించిన దుర్గాదేవి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయం వద్ద విద్యుత్, మంచినీటి సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా వందలాది మంది మహిళలు అమ్మవారికి బోనాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, హోమాలు చేశారు. తాటికొండ పవన్ దంపతులు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించగా, జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు, జనసేన నాయకుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, పలువురు నేతలు పాల్గొన్నారు. భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది.

బషీర్‌బీబీ ఉర్సులో పాల్గొన్న ఎంపీ గీత



దర్గాలో ప్రార్థనలో పాల్గొన్న ఎంపీ గీత

కొత్తపల్లి: పొన్నాడలో జరుగుతున్న బషీర్‌బీబీ ఉర్సు ఉత్సవాలకు ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత హాజరయ్యారు. దర్గా దర్బార్‌లో ఆదివారం ముజావర్లు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులమతాలకతీతంగా బషీర్ బీబీని భక్తులు దర్శించుకుంటారని, అనేక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో హాజరవుతారని చెప్పారు. చారిత్రాత్మకంగా బషీర్ బీబీ వారికి ప్రాధాన్యముందని, ఏడంతస్తులు ఉన్న ఈ దర్గా కాలక్రమంలో కూరుకుపోయినట్టు ఆధారాలు ఉన్నాయన్నారు. ఈ దర్గాను దర్శించుకుంటే మంచి జరుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసమన్నారు. స్థానికంగా తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రానున్న వేసవిలో ప్రజలకు తాగునీరు సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కారే సుధ, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు పాల్గొన్నారు.

సీఎం సాయం పంపిణీ



లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేసిన దవులూరి దొరబాబు

సామర్లకోట: ఎవరైనా ఆపదలో ఉన్నారంటే వారిని ఆదుకోవడంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుండి ఎంతమొత్తమైనా నిధులు వెచ్చిస్తారని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 13 మందికి రూ.8.53 లక్షల చెక్కులను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న దొరబాబు, జానీ

పెద్దాపురంలో..

పెద్దాపురం: ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజల ఆరోగ్యానికి పెద్ద అండగా నిలుస్తుందని అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ అన్నారు. తమ బంధువుల కుమార్తె నర్గీస్‌కు బ్రెయిన్ సర్జరీ నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన రూ.75 వేలను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. నర్గీస్ సమస్యను దొరబాబుకు వివరించగా ఆయన కృషి మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ నిధులను విడుదల చేసినట్టు జానీ పేర్కొన్నారు.

ముగిసిన చెకుముకి సంబరాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

కాకినాడ సిటీ: కాకినాడ జగన్నాథపురం అన్నమ్మ గాటీ జీఎంసీ బాలయోగి మున్సిపల్ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్స్ చెకుముకి సైన్స్ సంబరాలు ఆదివారం ముగిసాయి. ఈ సంబరాల్లో జిల్లాలోని 20 మండలాల నుంచి ప్రథమ స్థానంలో నిలిచిన మండల జట్లు, ప్రభుత్వ, ప్రైవేట్ విభాగాలుగా 40 జట్లుగా పాల్గొన్నాయి. ఈ పోటీల్లో పాల్గొన్న జట్లకు రాతపరీక్ష, రాపిడ్ ఫైర్, ఆడియో, వీడియో రౌండ్ అనే మూడు రౌండ్‌లుగా పాల్గొన్నారు. మూడు రౌండ్లు కలిపి ఎక్కువ మార్కులు సాధించిన వారిని విజేతలుగా ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు జిల్లా జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ గత 34 సంవత్సరాలుగా చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తుందన్నారు. ముఖ్య అతిథి చీఫ్ ఆపరేటింగ్ అధికారి మెర్ల మురళీధర్ మాట్లాడుతూ సమాజాన్ని మార్చాలంటే యువత వల్లనే సాధ్యమన్నారు. విద్యార్థి దశ నుంచి మంచి క్రమశిక్షణ సామాజిక అవగాహన పెంపొందించడం ద్వారా తయారు చేసుకోవాలని అటువంటి కృషిని జన విజ్ఞాన వేదిక చేస్తుందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో పాల్గొని విజేతలకు నిర్వాహకులు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదిక నాయకులు జి ప్రభాకర్ వర్మ, వి శ్రీరామారావు, బుద్ధా శ్రీనివాస్, ఎన్.సూర్యనారాయణ, ఎన్.కన్నబాబు, ఎస్.శ్రీను, యుఎస్ఎన్ రెడ్డి, బీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రిజిస్ట్రేషన్లు



సామర్లకోటలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఈ నెల 19వ తేదీ నాటికి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని కమిషనర్ జె.రామారావు ఆదేశాలు జారీ చేసింది. దాంతో ఆదివారం కూడా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగించారు. దీనిలో భాగంగా ఆదివారం పలు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కమిషనర్ పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో 5200 ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు జరగాల్సి ఉండగా ఆదివారం నాటికి 3,700 రిజిస్ట్రేషన్లు పూర్తయినట్టు కమిషనర్ తెలిపారు.

20న ఉచిత నేత్ర వైద్య శిబిరం

పెద్దాపురం: మండలంలోని క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతి గ్రామంలో మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మందిర నిర్వాహకులు నంగిన శామ్యూల్ సుదీప్, వ్యవస్థాపకులు నంగిన సత్యానందం తెలిపారు. ఆదివారం వారు స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ పిఠాపురం సీఎంసీ ఆసుపత్రి వారిచే ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మెగా వైద్య శిబిరం ఉంటుందన్నారు.

కొత్త యర్రవరంలో వింత జంతువు మృతి!



జంతు కళేబరం

ఏలేశ్వరం: కొత్త యర్రవరం గ్రామంలోని పుంత రోడ్‌లో ఆదివారం వింత జంతువు కళేబరం రైతుల కంటపడింది. దీనిని ముంగిస జాతికి చెందిన సివెట్ క్యాట్‌గా భావిస్తున్నారు. ఇది చెట్లు ఎక్కడంతో పాటు, అరటి చెట్లను, కొబ్బరి చెట్లపై బొండాలను నాశనం చేస్తోందని కొందరు గ్రామస్తులు చెప్పారు. దీనిపై ఫారెస్టు అధికారులను సంప్రదించగా, తమకు సమాచారం అందిందని తెలిపారు.

యాదవులకు సీఎం జగన్‌తోనే మేలు



దొరబాబును సత్కరించిన యాదవ సంఘు నాయకులు

సామర్లకోట: యాదవులకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అనేక రకాలుగా మేలు చేశారని యాదవ సంఘ నాయకులు పేర్కొన్నారు. స్థానిక పేరంటాలమ్మ తల్లి ఆలయం వద్ద శ్రీగోపాలకృష్ణ యాదవ సంఘ సర్వసభ్య సమావేశం ఆదివారం సాయంత్రం జరిగింది. సందర్భంగా ముఖ్యమంత్రి చేసిన మేలును వారు కొనియాడారు. కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారి జీవనోపాధి మెరుగు పరచడానికి బీమా జీఓ తీసుకు వచ్చి ఎంతో మేలు చేశారని కౌన్సిలర్ నమ్మి శ్రీనివాసు, వైఎస్సార్ బీసీ సెల్ రీజనల్ కో ఆర్డినేటర్ అల్లి రాజబాబు యాదవ్ పేర్కొన్నారు. కాకినాడ రూరల్‌లో 1200 గజాల స్థలం యాదవ సంక్షేమ భవనానికి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కనబాబు స్థలం కేటాయించారని తెలిపారు. గత తెలుగుదేశం పాలనలో యాదవ కులానికి చెందిన మంత్రులే యాదవులను పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ నియోజవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబును సత్కరించారు. యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వర కల్యాణోత్సవాలు



వేట్లపాలెంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం



గొల్లప్రోలు వేంకటేశ్వర స్వామి ఆలయం

సామర్లకోట: మండలంలోని వేట్లపాలెంలో కొలువైన వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు సోమవారం నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఏటా భీష్మ ఏకాదశి రోజున స్వామి, అమ్మవార్లను వధూవరులుగా చేసి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 24వ తేదీ వరకు ఈ కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. 20వ తేది భీష్మ ఏకాదశి సందర్భంగా లక్ష పుష్పాలతో 108 మంది భక్తులచే పూజలు చేయనున్నట్టు తెలిపారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ, అనంతరం శేషవాహనంపై ఉత్సవ మూర్తుల ఊరేగింపు, రాత్రి కల్యాణం నిర్వహించనున్నట్టు తెలిపారు. పారిశ్రామిక వేత్త మట్టే శ్రీనివాసు, నున్న రామకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో ఈ కల్యాణం నిర్వహించనున్నారు. 21న సింహ వాహన సేవ, 22న గరుడ వాహన సేవ, 23న హనుమద్వాహన సేవ, 24 ఉదయం లక్ష గోవింద నామ గానమృతం, చక్రస్నానం, పూర్ణాహుతి, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం గజ వాహన సేవ, రాత్రి శ్రీపుష్ప యాగోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 21వ నుంచి 24వ తేదీ వరకు జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేయనున్నారు. ప్రతి మండలంలో భజన మండళ్ల ఏర్పాటు చేసినట్టు నాగేశ్వరరావు తెలిపారు.

గొల్లప్రోలులో..

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీలో ఉన్న వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇటీవల గొల్లపల్లి చిన్నకొండ దంపతుల చేతుల మీదుగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, పందిరి రాటతో ఉత్సవాల పనులు ప్రారంభించారు. ఈ నెల 19 నుంచి 24 వరకూ కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్టు అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడు మొగలి అయ్యారావు తెలిపారు. ఈ నెల 20న స్వామి వారి దివ్య కల్యాణం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అర్చనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు.

నేడు స్పందన, డయల్ యువర్ కమిషనర్

బోట్‌క్లబ్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకు డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఆదివారం తెలిపారు. నగర ప్రజలు స్థానికంగా ఎదుర్కొనే సమస్యలు, ఇబ్బందులను నగర పాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884 2357800కు కాల్ చేసి తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే 10.30 నుంచి స్పందన యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా సమస్యలు తెలియజేయవచ్చునని కమిషనర్ సూచించారు.



సర్పవరం ఆలయం ప్రాంగణంలో పాలు పొంగించి సూర్య నమస్కారాలు చేసుకుంటున్న భక్తులు

నమో భావనారాయణా..

- సర్పవరం తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మాఘమాసం రెండో ఆదివారం ఆలయం వద్ద తిరునాళ్లు ఘనంగా జరిగాయి. తెల్లవారు జాము నుంచే జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో ఆవు పిడకలపై పాలు పొంగించి పొంగలి తయారు చేసి ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడికి నైవేద్యం సమర్పించారు. సూర్య నమస్కారాలతో ఆలయ ప్రాంగణంలో భక్తులు నిండిపోయారు. ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, ఈఓ భీమశంకరరావు, దేవదాయశాఖ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు పుల్ల చందు, కోటేశ్వరరావు, చక్రధర్ తదితరులు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చూశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఉచిత అన్నప్రసాదం అందించారు.



ప్రత్యేక అలంకరణలో భావనారాయణస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవారు



అన్న ప్రసాదం సేకరిస్తున్న తిరునాళ్లకు వచ్చిన భక్తులు